రాతిరి ఆమెకు నిదురపుచ్చింది.

ఆ తెల్లవారే.. ఫైనల్ ఇయర్ ఎగ్జామ్. ఉదయం పది గంటలకి చేరుకోవాల్సి ఉంది. ఎప్పటిలాగే బయల్దేరింది. కానీ, ఆ రోజూ వర్షం కురిసి గెడ్డ పెద్దదయ్యింది. దాటడం అవలేదు. పరీక్ష సమయం మించిపోయింది. ఆ పోవడం పోవడం. మళ్లీ చదువు గడపెక్కలేదు. మొత్తంగా తన చదువు మధ్యలో ఆగిపోవడానికి కారణం ఆ గెడ్డే. కాదు కాదు.. అక్కడ చప్టా కట్టకపోవడమే.

ఓ రోజు సాయంత్రం..

ఊరోళ్లందరూ కిందకి దిగాలని కబురొచ్చింది.

''ఏమిదానికట?''.. అని ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

''ఎమ్మెల్యమ్మ మీటింగెడతాదట. కింద ఊరి దాక బస్సేసినారట!''..

బస్సెక్కడమంటే సర్దా మా ఊరోళ్లకి. అదీ సీటు దొరికిన బస్సంటే ఇంకా సర్దా. ఎప్పుడు సూడు.. కొండ దిగడం.. నడ్డం! నడిసినా బరువుతో నడ్డం. నడిసినడిసి అలిసిపోతే.. ఆటోలకి ఏలబడ్డం. ఒక ఆటోకి ముప్పై మందిదాక ఏలబడుతూ సంతలకి వెళ్లడం. అలాంటి ప్రయాణాలు మాత్రమే తెలిసిన మా ఊరి జనానికి బస్సుల్లో కిటికీ పక్కన సీటులో కూర్చుని ప్రయాణించడమంటే.. కుర్రాళ్లేటి ముసిలోళ్లూ సరదా పడిపోతారు. బస్సుల్లో కూర్చున్నోళ్లకి ఒక బిర్యానీ పేకెట్టు, తాగినోళ్లకి సారా సీసా ఇప్పించడమే సర్పంచి పని. అవి అందరికీ అందితే గొప్పోడు, మంచోడు. అంతే!

పరుగు పరుగున కొండ దిగుతున్న నాకు మిలంతి ఎదురయ్యింది. తలమీద అరితేగల కట్ట, చేతిలో కంక. ఒళ్లంతా మట్టి నిండిన బట్టతో.. మట్టి తవ్వకాల్లో దొరికిన అపురూప వనమూలికలా కనిపించింది. దిగుతున్న తూగుకి దారివ్వని మిలంతిని గుద్దుకున్నంత పనైంది.

''ఏట్రా గాబరా?'' అని నిలదీసింది.

''మీటింగటే! బస్సెలిపోతాది..'' అని వెళ్లబోయేను. దారివ్వలేదు సరికదా..

''సిగ్గులేదురా నీకు?'' అని అడ్డం నిలబడింది.

''సిగ్గా? నీనెందుకు సిగ్గు పడాల?'' అని అసహనాన్ని ప్రకటించేను.. ఇదేదో అప్రస్తుతాన్ని మాట్లాడుతున్నదని.

''మీటింగంతే పారిపోతాత్రా! ఆ మీటింగులో ఒక్కనాడైనా మనూరు రోడ్డు గురించి, ఈ ఖానా గురించి అడిగినాట్రా?''..

అది నా కళ్లలోకి సూటిగా చూస్తున్నది. దాని తలమీద తేగలకట్ట తూలడం లేదు. చేతిలో కంక నిశ్చలంగా ఉంది. అది నన్ను ప్రశ్నిస్తున్నదా? ఇంకెవరినైనా హెచ్చరిస్తున్నదా? ఒక్కక్షణం దాని కళ్లలో తీవ్రతకి నేరుగా చూడలేకపోయాను. వాటి గురించి చాలాసార్లు ఊర్లో మీటింగు పెట్టుకున్నాం. చాలా దరఖాస్తులూ రాసేం. అధికార్ల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరిగాం. ఆ సంగతి దానికీ తెలుసు. అయినా అడుగుతున్నది. అంటే...? ఇంకేదో చెప్తున్నది.

నిశ్శబ్దంగా.. మౌనాన్ని మోసుకుంటూ..

పక్కకు తప్పుకొని.. దారి పక్క రాయిమీద అడుగేసి కిందికి దిగిపోయేను. దారిపొడుగునా దాని కళ్లు నన్ను వెంటాడుతూనే ఉన్నాయారోజు. దారిలో నడుస్తుంటే అడ్డమొచ్చిన ప్రతి రాయీ దాని చూపుల్ని తలపించింది. ఎదురైన ప్రతి డొంకా ఆ చూపుల తీవ్రతని గుర్తుచేసింది. గెడ్డ దాటుతుంటే.. దాని కల ఏమిటో మెల్లమెల్లగా స్పష్టమవడం ఆరంభించింది.

దిగువూరు చేరేసరికి బస్సు జనాల్ని ఎక్కించుకుని దుమ్ము రేపుకొంటూ వెళ్లిపోవడం కనిపించింది. ఆకుపచ్చని కొండ మొదుల్లో బస్సు రేపిన దుమ్ము నా ముఖమ్మీదా పడింది. దులుపుకొంటూ.. కళ్లు నులుముకుంటూ.. వెనుతిరిగాను.

మిలంతితో మాట్లాడాలి. దాని కల గురించి మాట్లాడాలి. నిజానికి ఆ కల దానిది మాత్రమే కాదు. అది ఊరందరి కల. కొండ ఎక్కి ఇల్లు చేరేసరికి మిలంతికి నొప్పులు ఆరంభమయ్యేయి. ఏ కొండ మీదో మేఘం గర్జించింది. చీకటి పడింది. బిడ్డ అడ్డం తిరిగింది.

ఏ చీకటి లోకాల్లోంచో రాలింది ఒక్క చినుకు..

'టప్...!' మని. ఊరు ఉలిక్కిపడింది. అందరి గుండెల్లో రాయిపడింది. పురుడు పోసే మండింగి ముసిలమ్మకి కబురు చేసేరు. ప్రయత్నమంతా చేసి చేతులెత్తేసింది ముసిల్దాయి. ఎలాగైనా మిలంతిని కిందకి దింపాలని నిర్ణయించేం. అప్పుడు కనిపించింది మా ఊరోళ్లందరికీ దారి! నరకానికి నడుస్తున్నట్టుగా.. దెయ్యాలు భూతాలకీ జడవని ఊరి పెద్ద కూడా ఆ దారిని తలచుకొని నిలువెల్లా వణికిపోయేడు. అప్పుడు కట్టేం డోలీ! వెదురు కర్రకి దుప్పటి కొసల్ని కట్టి సిద్ధం చేసేం డోలీ!

డోలీ దిగుతుంటే మిలంతి కాన్పు బాధ కన్నా ఊరోళ్ల ఏడుపులే కొండల్లో ప్రతిధ్వనించేయి. మా ఊర్లో డోలీ ఎత్తడమంటే.. శవయాత్ర చేస్తున్నట్టే! ఎందుకంటే డోలీలో కొండ దిగిన ఏ రోగీ తిరిగి రాలేదు.

నాకు దుఃఖమాగడం లేదు. గొంతు నుంచి ఒక్క మాటా పెగలడం లేదు. ఎందుకో మిలంతి చూపులు మళ్లీ కదలాడేయి. వాటి అర్థమేదో క్రమక్రమంగా స్ఫురిస్తున్నట్లు అవుతున్నది. డోలీలు మా బతుకులనొదలవా? డోలీల్లేని జీవితాలు మేము చూడలేమా?

ఒక్కసారైనా మా ఎమ్మెల్యేను జుట్టు పట్టుకునైనా మా ఊరు లాక్కు రావాలని. ఆ కుర్చీ మీద కూకుండబెట్టడానికి మేము కిందకి దిగి ఓట్లెయ్యాలా? మాకు కష్టమొస్తే ఆ కుర్చీ కొండెక్కదెందుకని ఒక్కసారైనా అడగాల. పిలక పట్టుకుని.. 'మా ఊరుకి రోడ్డేస్తావా లేదా!?' అని నిలదీయాలని ఉంది. నడుస్తున్న దారి సన్నగా రోదిస్తూ తనను తాను చీల్చుకుని మమ్మల్ని నడిపిస్తున్నది.

గుండెలు దిటవు చేసుకొని.. మొండిధైర్యంతో..

ఎలాగైనా మిలంతిని బతికించుకోవాలని డోలీ ఎత్తేం.

చీకట్లో.. చినుకులు రాలుతున్న దారిలో..

తరాల మా కల! ఎప్పటికప్పుడు కరిగిపోతూ!

బయల్దేరేం.

వాన పెరిగింది. ఎక్కడో మొదలైన వాన మా మీదా కురిసింది. మిలంతి మీదా కురిసింది. మిలంతి కడుపులోని బిడ్డపైనా కురిసింది. మేము నడవాల్సిన దారిపైనా కురిసింది. వాన! మా పైనా! లోలోనా!

ఇలాంటప్పుడే కొండ జారిపోతూ ఉంటుంది. రాళ్లు మెత్తబడిపోతాయి. దారి రోజూలా ఉండదు. అడుగు అడుగూ ఆచి తూచి వెయ్యాలి. తేడా వచ్చిందో.. నడకలో ఉన్నప్పుడే జారిపోతాం. మరి డోలీ మోస్తున్నప్పుడో! అదీ చీకట్లో? నడుస్తున్నాం. అంతే! కానీ సందేహం అందరిలో. ఏడు కిలోమీటర్ల కొండ దిగి, మూడు కిలోమీటర్ల నడక ప్రయాణం. ఈలోగ సిగ్నల్ దొరకప్పుడ్కో వాలి. అంబులెన్స్‌ని అందుకోవాలి. ఆసుపత్రి చేరాలి. మాలో ఎవరికీ నమ్మకం చాలడం లేదు. అయినా..

మొండిగా.. గుడ్డిగా.. చీకట్లో..

అక్కడికి చేరుకున్నాం. గెడ్డ హోరు దాని ప్రవాహ వేగాన్ని తెలుపుతున్నది. దాటడం అసాధ్యమని చెప్పకనే చెబుతున్నది. చీకట్లో గెడ్డ మాకు వినిపిస్తున్నది. చెవుల్తో గెడ్డని చూస్తున్నాం. చెట్టు కింద చినుకులు పడవని ఆశతో ఆగేం. గెడ్డకవతల.. మీటింగు నుంచి తిరిగొచ్చిన మా ఊరి జనం. చేతుల్లో పాలిథీన్ బేగుల్లో బిర్యానీ పొట్లాలూ, మందుసీసాలు!

పగలైతే ప్రవాహం ఎక్కువైనపుడు ఎప్పటిలాగే ఆ చెట్టుకిందే ఆగుతాం. ప్రవాహం తగ్గి గెడ్డ చల్లబడితే తల్లి కనికరిస్తే గెడ్డ దాటడం అలవాటు మాకు.

ఆగిపోయేం. అక్కడే. గెడ్డ దాటలేక.. వేరే దారిలేక. ఆగిపోయాం. గెడ్డకి ఇవతల! వాన తగ్గదు. గెడ్డ ఆగదు. చీకటి కరగదు. వెలుతురు కానరాదు. ఎదురు చూస్తూ ఆగిపోయాం అక్కడే. తరతరాలుగా ఆ చెట్టు కిందే.

మా ముందు ఎన్ని తరాలు ఆగాయో అక్కడ. మా ముందు ఎన్ని ఆర్తనాదాలు ఆ చీకట్లో ప్రతిధ్వనించాయో.. అక్కడ! ఎన్ని డోలీలు శవాలుగా మారేయో.. అక్కడ! ఎదురు చూస్తునే ఉన్నాం.. వాన ఆగుతుందనీ! వాగు తగ్గుతుందనీ.. దారి దొరుకుతుందనీ!

ఎదురు చూస్తునే ఉన్నాం.. తరతరాలుగా.. నిండు చూలాలి ఆర్తనాదాల్తో!

నిస్సహాయంగా.. అక్కడే నిలబడిపోయాం. ఎప్పుడో ఆగిపోయాం.

నా చేతిలో సెల్‌ఫోన్‌కి సిగ్నల్ దొరికిందేమో.. వెలిగి ఆరింది. భారతదేశం చంద్రుడి దక్షిణ ధృవం మీదకి విజయవంతంగా అడుగుపెట్టిందట.. బ్రేకింగ్ న్యూస్! దేశం వెలిగిపోతున్నది. మేమింకా గెడ్డకివతల ఒడ్డునే ఎదురు చూస్తున్నాం దాటడానికి.. ప్రాణాలు డోలీల్లో పెట్టుకుని!

డోలీలో.. మిలంతి కనుకొసల్లో ద్రవించిన కలలన్నీ నేలరాలిపోగా..

ఒకే ఒక్క బిందువు మాత్రం కన్ను జారడం లేదు.. పంటి కింద పెదవిపై భరిస్తున్న నొప్పిలా..

ఎలాగైనా గెడ్డ దాటాలన్న చిన్న కలలా..

## మల్లిపురం జగదీశ్



78 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఆదివాసీలు ఎక్కడున్నారో.. వారి స్థానమేమిటో 'ఒక మిలంతి కల' ద్వారా ప్రపంచానికి చెబుతున్నారు రచయిత మల్లిపురం జగదీశ్. ప్రాథమికమైన ఒక చిన్న కల.. తరతరాలుగా ఒడ్డు చేరలేకపోవడాన్ని ఈ కథలో వ్యాఖ్యానించారు. 'మల్లిపురం జగదీశ్'గా రచనలు చేస్తున్న వీరి పూర్తిపేరు.. మల్లిపురం జగదీశ్వర రావు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి. ఆమిటి అనే ఆదివాసీ గ్రామం.. ఈయన స్వస్థలం. ఎం.ఏ (ఆంగ్లం), ఎం.ఏ (తెలుగు), బీ.ఈడీ చేశారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల సహోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆదివాసీల అస్థిత్వమే నేపథ్యంగా కథలు రాస్తున్నారు. ఈయన మొదటి కథ.. 'అక్షరాల దారిలో'. ప్రజాశక్తి దినపత్రికలో అచ్చయ్యింది. 'శిలకోల', 'గురి', 'అడవి పూల దారిలో'.. కథా సంపుటాలను, 'దుర్ల' కవితా సంకలనాన్ని వెలువరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విద్యార్థులకు 'శిలకోల' కథలు, 'దుర్ల' కవితలు పాఠ్యాంశాలుగా తీసుకున్నారు. 'ఉరులు' కథ.. తొమ్మిదో తరగతి విద్యార్థులకు తెలుగు పాఠంగా ఎంపికయ్యింది. ఈయన రచనలపై పలువురు పరిశోధకులు ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు.